క్లుప్తంగా

వాహనాల తనిఖీ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టు శుక్రవారం ఎస్సై ఎం.సురేష్ వాహనాలు తనిఖీ చేశారు. కార్లు, టూవీలర్ తదితర వాహనాల తనిఖీ చేసి ఎన్నికల కోడ్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. రూ.50 వేలలోపు మాత్రమే నగదు తీసుకెళ్తే సీజ్ చేయమని అంతకు మించి నగదుతో వెళ్లే వారు విధిగా ఆ నగదుకు సంబంధించిన ఆధారాలు చూపాల్సి ఉంటుందన్నారు. పోలీస్‌శాఖకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

70 మందిపై బైండోవర్ కేసులు

వేంసూరు: ఎన్నికల నేపథ్యంలో వేంసూరు మండలంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న 70 మందిని పోలీసుల అరెస్టు చేసి తహసీల్దార్ ఎంఏ రాజు ఎదుట హాజరుపరచగా వారిపై బైండోవర్ కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకు వేంసూరు మండలంలో 302 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

పది మందిపై..

తల్లాడ: మండలంలో మద్యం విక్రయిస్తున్న పదిమంది బెల్టు దుకాణదారులపై శుక్రవారం ఎక్సైజ్ ఎస్సై కిరీట్, పోలీసులు.. తహసీల్దార్ వి.రవికుమార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు మండలంలో 150 మందిని బైండోవర్ అయ్యారని తెలిపారు.

ఇతరులకు కేటాయించొద్దు



మాట్లాడుతున్న మాలోత్ రాందాస్ నాయక్

వైరా: వైరా నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీ చాలా బలంగా ఉన్నందున వైరా టికెట్ పొత్తులలో భాగంగా ఇతర పార్టీలకు కేటాయించొద్దని పీసీసీ సభ్యుడు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం వైరాలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ ఖేత్ రాష్ట్ర నాయకుడు దాసరి దానియేలు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో ఏ నియోజకవర్గంలో రాని మెజార్టీ కాంగ్రెస్ పార్టీకి తీసుకొవచ్చి చూపిస్తామన్నారు. అనంతరం పలువురు నాయకులు వైరా టికెట్ ఎన్నో ఏళ్లగా వైరాలో సేవలందిస్తున్న రాందాస్ నాయక్‌కు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పాదిల హరినాధ్, వేముల కృష్ణప్రసాద్, పమ్మి అశోక్, బత్తుల గీత, నరసింహారావు, గంగారావు, కొండలు, కృష్ణారావు, శ్రీను, కృష్ణయ్య, పుష్పలత, నీరజ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాడులను ఖండించండి..

సత్తుపల్లిటౌన్: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దురాక్రమణ దాడులను ఖండించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు బి.లాజర్ కోరారు. స్థానిక రింగ్‌సెంటర్‌లో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యాన శుక్రవారం ఇజ్రాయిల్ దురాక్రమణలను నిరసిస్తూ నల్లజెండాలతో నిరసన ప్రదర్శన చేశారు. పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు అమర్లపూడి శరత్, నాగిరెడ్డి, పుల్లారావు, అలివేలు, రాఘవులు, హనుమంతు, విశ్వనాధం, లక్ష్మణ్‌రావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

వైరా: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు నిలిపివేయాలని.. ఇజ్రాయిల్‌కు అనుకూలంగా మాట్లాడుతున్న ప్రధాని మోదీ తన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సీవై పుల్లయ్య అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వైరాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాడులను ప్రధాని మోదీ సమర్థించడం నీచమైన చర్య అన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి కంకణాల అర్జునరావు, నాయకులు పాశం అప్పారావు, బాబు, శ్రీను, జానీ, భద్రయ్య, వెంకన్న, లాలమ్మ పాల్గొన్నారు.

శంకుస్థాపన



శ్రీదాసాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని శ్రీ దాసాంజయనేయస్వామి ఆలయ పునఃనిర్మాణానికి శుక్రవారం అర్చకుడు కొత్తూరి రాజేష్ శర్మ శాస్త్రోక్తంగా, వేదమంత్రాల నడుమ శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయ పునఃనిర్మాణానికి గానూ గ్రామాల్లో విరాళాలు సేకరించే ప్రక్రియను ఆరంభించారు. ప్రజల విరాళాలతో ఆలయ నిర్మాణం చేపడతామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మొగిలి అప్పారావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పూల పండుగ.. లాభాలు మెండుగా

- వాణిజ్య పంటలపై తగ్గిన ఆసక్తి
- బంతి, చామంతి, కూరగాయల సాగుతో కాసులు గడిస్తున్న రైతులు

పూలను సాగు చేసిన రైతులు బహు లాభాలు అర్జిస్తున్నారు. వరుసగా వస్తున్న పండగలతో మార్కెట్‌లో పూలకు గిరాకీ పెరిగింది. బతుకమ్మ, నవరాత్రుల పూజలకు పూల అవసరం అధికంగా ఉండడంతో వాటి కొనుగోళ్లు భాగా పెరిగాయి. దీంతోపాటు ధరలు పెరిగి రైతులకు లాభాలు తెచ్చిపెడుతున్నాయి.



ముష్టికుంట్లలో వేసిన బంతితోట

బోనకల్: బతుకమ్మ, దసరా పండగలు పూల రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. రైతులు వాణిజ్య పంటలతో కొంత వరకు నష్టాలు చవిచూడడంతో.. వారు ఉద్యాన పంటలపై దృష్టి సారిస్తున్నారు. దీంతో మంచి గిట్టుబాటు ధర లభించడంతో రైతులు సంతోషపడుతున్నారు.

500 ఎకరాల్లో ఉద్యాన సాగు..

ముష్టికుంట్ల గ్రామంలో గత పది సంవత్సరాలుగా రైతులు వాణిజ్య పంటలు సాగును వదిలి, ఉద్యాన పంటలైన బంతి, చామంతి తదితర పూలసాగులతో పాటుగా.. కూరగాయలు సాగుపై దృష్టిసారించి లాభాలు అర్జిస్తున్నారు. మండలంలో సుమారు 500 ఎకరాల్లో రైతులు వీటిని సాగు చేయడం విశేషం.

పండుగ సీజన్‌లో పూలసాగు..

బతుకమ్మ, కార్తీకమాసం, అయ్యప్పస్వాములు, గోపయ్యస్వాములు మాలధారణ సమయాల్లో పూలకు డిమాండ్ ఉండటంతో ఆ సమయాల్లో పూలసాగును చేపడుతున్నారు. ఇక్కడ ఏడాదికి మూడుసార్లు బంతిసాగు చేపడతారు. బంతి మొక్క నర్సరీ నుంచి రూ.3ల చొప్పున కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. ఎకరం సాగుచేయడానికి ఎకరాకు రూ.30 వేలు ఖర్చు అవుతుంది. పెట్టుబడి మరో రూ.30 వేలు పెడితే 80క్వింటాళ్ల బంతిపూలు దిగుబడి వస్తాయని రైతులు తెలిపారు. ఈ ప్రాంతంలో విక్రయించగా మిగిలిన పూలను విజయవాడ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌ల ఏ సీజన్‌లోనైనా కిలో 30 రూపాయల ధర పలుకుతాయన్నారు. అన్ని ఖర్చులు పోనూ ఒకపంటకు లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తుందన్నారు. ఈ విధంగా ఏడాదిలో మూడు దఫాలుగా బంతి సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా అంతర్‌పంటగా కూడా కూరగాయలను సాగుచేసే అవకాశం ఉందని, వీటి ద్వారా లాభాలు పొందవచ్చని తలిపారు.

ఐదేళ్లుగా బంతి సాగు చేస్తున్నా..



గతంలో మిర్చిసాగు చేయడంతో నష్టాలపాలయ్యాను. దీంతో అప్పుల ఊబిలో కూరకుపోయాను. వాణిజ్య పంటలను ఆపి ఈ ఏడాది 2 ఎకరాలలో బంతి పూలు, 3ఎకరాలు కూరగాయల సాగు చేస్తున్నా. ఏడాదికి ఎకరాకు రూ.3 లక్షల వరకు మిగులుతున్నాయి.

– బొడ్డుపల్లి మల్లిఖార్జున్, రైతు, ముష్టికుంట్ల

కొనుగోలు చేస్తున్నారు..



గతంలో మిర్చి, పత్తి సాగు చేసి తీవ్రంగా నష్టపోయా.. దీంతో గత 10 ఏళ్లుగా బంతి, చామంతి, కనకాంబరాలతో పాటు పందిళ్లు వేసి కూరగాయలు సాగుచేస్తున్నా. బోనకల్–ఖమ్మం ప్రధాన రహదారి మార్గంలో ఉన్న పొలాలను సాగుచేస్తుండడంతో ప్రయాణీకులు కొనుగోలు చేస్తున్నారు.

– బొడ్డుపల్లి పురుషోత్తం, ముష్టికుంట్ల, రైతు

లాభాలు వస్తున్నాయి..



బతుకమ్మ పండుగ, అయ్యప్పలు, గోపయ్యస్వాముల మాలధార సమయంలో పూలు వచ్చేలే సాగుచేస్తున్నాం. బంతి పూలు కిలో 50 రూపాయలు, పండగ సీజనల్‌లో కిలో రూ.100 నుంచి 150 వరకు ధర పలుకుతుంది. మంచి లాభాలు వస్తున్నాయి.

– బొడ్డుపల్లి నరసింహారావు, రైతు, ముష్టికుంట్ల

సాగర్ జలాలతో నింపాలి



ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైరా: వైరా రిజర్వాయర్‌ను సాగర్ జలాలతో నింపాలని పీసీసీ సభ్యుడు యం.రాందాస్ నాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైరా ఇరిగేషన్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. వైరా రిజర్వాయర్ నీటి మట్టం పూర్తిగా అడుగంటిందని, వైరా రిజర్వాయర్ కింద సుమారు 50 వేల ఎకరాల సాగు జరుగుతుందన్నారు. ఆ పంటలు ఎండిపోతున్నందున సాగర్ జలాలతో రిజర్వాయర్‌ను నింపి సాగు నీరు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి దానియేలు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పాదిల హరినాథ్, వేముల కృష్ణప్రసాద్, పమ్మి అశోక్, బత్తుల గీత, పాలేటి నరసింహారావు, గంగారావు, కొండలు, కృష్ణారావు, శ్రీను, నీరజ, బాలమ్మ, మేరి పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నాయి..

కల్లూరు: సాగర్ ఆయకట్టు పరిధిలో సాగు చేస్తున్న వరి పంటలు సాగునీరు లేక ఎండిపోతున్నాయని కౌలు రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాయిన్ని రామారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ముచ్చవరం, లింగాల గ్రామాల్లో వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఎండిన పొలాల్లో పశువులను మేపుతున్నారని.. కావున సాగునీటిని విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు యరమల రామిరెడ్డి, గోపాలం, శక్రు, ప్రసాద్ పాల్గొన్నారు.

అన్నిదానాల్లో కెల్లా అన్నదానం మిన్న

ఏన్కూరు: అన్నిదానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని వైరా నియోజవర్గ కాంగ్రెస్ నాయకురాలు బానోత్ విజయబాయి అన్నారు. మండలంలోని జన్నారం ఎస్టీకాలనీలో దేవీనవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్వర్ణ నరేందర్, ముక్తి వెంకటేశ్వర్లు, నల్లమల శివకుమార్, గిద్దగిరి సత్యనారాయణ, సక్రు నాయక్, భువనేశ్వర్‌రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 7:30 గంటల నుంచి 9:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని కుర్నవల్లి సెక్షన్ విద్యుత్‌శాఖాధికారి సుందర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని కుర్నవల్లి, కలకొడిమ, బస్వాపురం, ముద్దునూరు, కేశ్వాపురం, రంగాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎంపీ నామకు సన్మానం



ఎంపీ నామ నాగేశ్వరరావును సన్మానిస్తున్న రైతులు

ఏన్కూరు: దశాబ్దకాలంగా సొంత భూమిపై హక్కులు లేక ఇబ్బంది పడుతున్న రైతుల సమస్యను ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు అధికారులకు చెప్పి పరిష్కరించారు. ఈనేపథ్యాన రైతులు మండలంలోని గార్లఒడ్డులో శుక్రవారం ఎంపీని సన్మానించారు. తల్లాడ, ఏన్కూరు సరిహద్దులో ఉన్న భూసమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారని తెలిపారు. అనంతరం గార్లఒడ్డులో అనారోగ్యంతో బాధపడుతున్న ఏన్కూరు ఎంపీటీసీ శెట్టిపల్లి రాధమ్మను ఎంపీ పరామర్శించారు. వైరా ఎమ్మెల్యే లావుడ్యారాములు నాయక్, బీఆర్‌ఎస్ వైరా అభ్యర్థి బానోతు మదన్‌లాల్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరావు, వైరా మార్కెట్ చైర్మన్ పసుపులేటి మోహన్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములుతో పాటు కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరావు, శెట్టిపల్లి వెంకటేశ్వరావు, భూక్యా లాలు, బానోతు సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోలాటం కర్రలు వితరణ

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లాడలో బతుకమ్మ ఆడుతున్న పలు మహిళా కోలాట బృందాలకు కోలాటం కర్రలను ఉచితంగా అందజేశారు. తెలంగాణా సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగను ఊరూరా గొప్పగా జరుపుకుంటున్నారనీ, ఇందుకు ప్రతి సంవత్సరం తమ వంతు ప్రోత్సాహకరంగా ఏదో ఒకటి బహకరిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

అన్ని వర్గాలను మోసం చేసిన బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న మట్టా దయానంద్

సత్తుపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ ఆరోపించారు. కల్లూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు అంటూ కొంతమందికి మంజూరు చేస్తూ మిగిలిన వారిని విస్మరించారని తెలిపారు. అంతేకాక కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయమని, ఆ వెంటనే అందరికీసంక్షేమ ఫలాలు అందిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు నారాయణవరపు శ్రీనివాస్, నారపరెడ్డి, దేవరపల్లి వెంకటేశ్వర్లు, కె.వేలాద్రి, భూక్యా శివ, లింగబోయిన పుల్లారావు, ఎనుముల రాము, ఉస్మాన్, తురాబ్‌అలీ, బత్తుల రాము తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడించాలి



కాంగ్రెస్ గ్యారంటీ కార్డులతో నాయకులు

సత్తుపల్లి: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొత్రపాటి సాల్మన్ రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని లలితకుమారి ఆస్పత్రి రోడ్, అయ్యగారిపేట, మారుతినగర్‌లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తుందని, 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శివవేణు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోళ్ల అప్పారావు, వెలిశాల వెంకటాచారి, హలావత్ వెంకటేశ్వర్లు, తోట రాజేష్, బీరా అబ్బులు, జొన్నలగడ్డ శ్రీను, రాయల కోటేశ్వరావు, విశ్వనాథం, కృష్ణ, అనూష, అనురాధ, సావిత్రి, యల్లమ్మ, సుగుణ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీకగా జరుపుకునే బతుకమ్మ వేడుకలు అన్ని మండలాల్లో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, పిల్లలు, యువతులు కోలాట నృత్యాలు చేస్తూ.. రకరకాల పూలను సేకరించి బతుకమ్మలను పేర్చి వాటి చుట్టు తిరుగుతూ సందడి చేశారు. అనంతరం గ్రామ సమీపంలో ఉన్నటువంటి కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పెనుబల్లి: మండల పరిషత్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



ఎర్రుపాలెం: ఐకేపీ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళలు



చింతకాని: మండల పరిషత్ కార్యాలయంలో..



బోనకల్: మండల పరిషత్ కార్యాలయంలో..



సత్తుపల్లిటౌన్: బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

అయ్యప్ప, దుర్గామాత స్మరణలతో మార్మోగిన రాజీవ్‌నగర్

సత్తుపల్లిటౌన్: స్వామియే శరణం అయ్యప్ప, జై మాతా.. జైజై దుర్గామాతా అంటూ భక్తుల శరణఘోషతో సత్తుపల్లి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్ గురువారం రాత్రి మార్మోగింది. రాజీవ్‌నగర్ శ్రీవిజయదుర్గా అయ్యప్పస్వామి దేవాలయం 8వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా గురువారం రాత్రి అయ్యప్పస్వామి, శ్రీవిజయదుర్గా అమ్మవారి పూడిపూజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పదునెట్టాంబడి అయ్యప్పస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, డాక్టర్ మట్టా దయానంద్‌లు వేర్వేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వాములు రామడుగు గురుప్రసాదాచార్యులు, తాటిపత్తి వీర బ్రహ్మాచార్యులు ఆధ్వర్యాన పడిపూజను జరిపారు. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మంది అయ్యప్పస్వామి, భవాని మాలాధారణ భక్తులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తుంబూరు వెంకటరెడ్డి, చల్లగుళ్ల నర్సింహారావు, సూరిశెట్టి పాపారావు, ఉడతనేని అప్పారావు, ధర్మకర్త చలసాని హరీశ్, వీరిశెట్టి సురేశ్, ఆర్‌వీఆర్, పసుమర్తి కృష్ణారావు, భక్తులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి మెట్లపై పడి వెలిగిస్తున్న గురుస్వాములు

వైభవంగా శ్రీనివాసమూర్తి కల్యాణం



తల్లాడలో శ్రీనివాసమూర్తి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తల్లాడ: తల్లాడలో వేంచేసి ఉన్న హనుమత్ పద్మావతి వేంకటేశ్వర సమేత ఆలయం కల్యాణ మండపంలో గురువారం రాత్రి వైభవోపేతంగా శ్రీనివాసమూర్తి కల్యాణం జరిగింది. ఆలయం వద్ద నుంచి ఉత్సవ మూర్తులను రథంపై ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకెళ్లారు. ఆలయ ప్రధాన అర్చకులు దివి సీతారామాచార్యులు, విఖనసాచార్యులు, బాలక్రిష్ణమాచార్యుల బృందం ఆధ్వర్యంలో కన్నుల పండుగగా వేంకటేశ్వర కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు పీటలపై కూర్చొన్నారు. స్వామి వారికి పలువురు పట్టు వస్త్రాలు బహుకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

కారేపల్లి: కారేపల్లి శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా.. గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో కోటి లింగాల మట్టి ప్రతిమలను (పార్థివ లింగాలు) తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు, ఆలయ కమిటీ చైర్మన్ మండెపూడి శ్రీనివాసరావు, కాటేపల్లి జనార్దన్, ఓరుగంటి రంగనాథ్, చిరునోముల రామారావు, రాజు, ఆమంచి బుచ్చిబాబు, సాయిభరత్, టంటం వెంకన్న, కంచి రమేష్, బృందావన్ మధు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

దేవీశర్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెనుబల్లి మండల వ్యాప్తంగా కనక దుర్గమ్మ విగ్రహాలను శుక్రవారం వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారు ఆరవరోజు మహాలక్ష్మీదేవి, సరస్వతీదేవి, అన్నపూర్ణ దేవి అవతారాల్లో దర్శణమివ్వగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారికి ఇష్టమైన చెక్కర పాయసం, పులిహోర నైవేధ్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



పెనుబల్లి: కోదండరామాలయంలో కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



మధిర: సరస్వతీదేవి అవతారంలో అమ్మవారు



తల్లాడ: కోట మైసమ్మ ఆలయం వద్ద..



ఏన్కూరు: చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం



ఎర్రుపాలెం: అమ్మవారికి పూజలు చేస్తున్న పొంగులేటి మాధురి శ్రీనివాసరెడ్డి, భక్తులు



కొణిజర్ల: పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు పాలకుర్తి నాగేశ్వరరావు, తదితరులు



బోనకల్: ముష్టికుంట్లలో మహాలక్ష్మీ దేవి అవతారంలో అమ్మవారు



చింతకాని: మత్కేపల్లి గ్రామంలో..



సత్తుపల్లిటౌన్: సరస్వతీదేవి అవతారంలో..



వైరారూరల్: కొండకొడిమ గ్రామంలో..